www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 18 జులై 2025 | 5 | తూర్పుగోదావరి

చిన్నారి మోహన కుటుంబానికి ఎంపి పరామర్శ

కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపి

ప్రజాశక్తి - కడియం

మండలంలోని మాధవ రాయుడుపాలెం శివారు చైతన్యనగర్‌కు చెందిన అరుదైన వ్యాధితో మృతి చెందిన చిన్నారి మోహన తల్లిదండ్రులను డొక్కా ఈశ్వర్, శ్రావణిలను ఎంపి దగ్గుబాటి పురంధరేశ్వరి గురువారం పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి ఓదార్చారు. పరామర్శించిన వారిలో రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, కూటమి పార్టీల నాయకులు పిక్కి నాగేంద్ర, ఆకుల శ్రీధర్, బొరుసు సుబ్రహ్మణ్యం, దాసరి ముత్యం, తాలాబత్తుల భవాని, భాస్కర్, కొత్తపల్లి శివదుర్గాప్రసాద్, బొప్పన లోవరాజు, ధనుంజయ్ తదితరులు ఉన్నారు.

రేషన్‌లో కందిపప్పుకు మంగళం

- బియ్యం, పంచదారకే పరిమితం
- డీడీలు తీయొద్దంటూ అధికారుల ఆదేశం
- జిల్లా వ్యాప్తంగా 375 టన్నుల పప్పు అవసరం
- బహిరంగ మార్కెట్లో కొనలేక ఇబ్బందులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కూటమి ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో కందిపప్పు సరఫరాకు మంగళం పలికింది. అధికారంలోకి వచ్చాక ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తామంటూ ప్రకటనలు ఇచ్చిన కూటమి పార్టీల ఆచరణలో పూర్తి భిన్నంగా వ్యవహరిస్తోంది. కేవలం బియ్యం, పంచదార పంపిణీ చేసి చేతులు దులుపుకుంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 871 రేషన్ దుకాణాలు ఉన్నాయి. రేషన్ కార్డులు 5.64 లక్షలు ఉండగా వాటిలో బియ్యం కార్డులు 5.44 లక్షలు, అంత్యోదయ కార్డులు 20 వేలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలకే ఎండియు వాహనాలతో పంపిణీకి చాపచుట్టేసిన విషయం విదితమే. మరోవైపు ప్రజలకు అత్యవసరమైన కందిపప్పు సరఫరాకు మంగళం పాడేసింది. నెలనెలా కందిపప్పు లబ్ధిదారులకు సరఫరా చేయాలంటే సుమారు 375 టన్నులు అవసరమవుతుంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి మూడు నెలలు మొక్కుబడిగా కందిపప్పు సరఫరా చేసింది. లబ్ధిదారుల్లో సగం మందికి అందేది కాదు. ఇక రాను రాను పంపిణీని నిలిపేసింది. వచ్చే నెలలో పంపిణీ చేస్తామంటూ పౌరసరఫరాల శాఖ అధికారులు ఏ నెలకానెల చెబుతూ వస్తున్నారు. ప్రతి నెలా కార్డుదారులకు నిరాశ తప్పడంలేదు. ఈ నెల కూడా కందిపప్పు రాలేదని డీలర్లు చెబుతుండటంతో చేసేది లేక ఇచ్చిన బియ్యం తీసుకుని వారు వెనుతిరుగుతున్నారు.

పెరిగిన ధరలతో అవస్థలు..

ప్రస్తుతం మార్కెట్లో కందిపప్పు కిలో రూ.130 ఉంది. రేటు ఎక్కువగా ఉన్నప్పుడు సబ్సిడీపై ఇవ్వలేని ప్రభుత్వం, కనీసం ధర తక్కువగా ఉన్నప్పుడైనా ప్రజలకు అందించేందుకు ముందుకు రావడం లేదు. మూడు నెలల క్రితం బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు రూ.180 వరకూ పలికింది. ఈ ధర కొన్ని నెలపాటు కొనసాగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమయంలో సబ్సిడీ ధరకు కందిపప్పు సరఫరా చేసి ఆదుకోవాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసింది. 'కూటమి ప్రభుత్వం వస్తుంది..మీ కష్టాలు తీరుస్తుంది' అని ఊదరగొట్టిన పాలకులు పేద ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా ఒక్క సంక్షేమ పథకం ఇవ్వకపోగా, చివరకి కందిపప్పును కూడా కార్డుదారులకు పంపిణీ చేయక పోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలో పేద, మధ్య తరగతి ప్రజలు జీవనానికి ఇబ్బందులు పడుతున్నారు. బహిరంగ మార్కెట్లో ఆయిల్, కందిపప్పు ధరలు ఆకాశాన్నంటడంతో కొనుగోలు చేయడం కూడా వారికి మించిన భారంగా మారింది. ప్రభుత్వం రాయితీపై రేషన్ షాపుల్లో కందిపప్పు సరఫరా చేయాలని కార్డుదారులు కోరుతున్నారు. చౌక దుకాణాల్లో కేజీ రూ.67కు అందాల్సిన కంది పప్పును బయట మార్కెట్లో రూ.130 నుంచి రూ.150 వరకు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.

డీడీలు తీయని డీలర్లు

రేషన్ డీలర్లు ప్రతి నెలా 20వ తేదీ లోపు డీడీలు తీసి, తమ పరిధిలోని కార్డుదారులకు అవసరమైన బియ్యం, కందిపప్పు, పంచదార వంటి సరుకులు దిగుమతి చేసుకుంటారు. కొన్ని నెలలుగా డీలర్లు డీడీలు తీస్తున్నా పౌర సరఫరాల శాఖ మాత్రం అవసరమైన మేరకు కందిపప్పు సరఫరా చేయడం లేదు. ప్రస్తుతం కందిపప్పు కోసం డీడీలు తీయవద్దని డీలర్లకు ముందుగానే అధికారులు సమాచారం ఇస్తున్నారు. దీంతో వారు డీడీలు కట్టడం మానేశారు. బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు కావాలని కార్డుదారులు అడుగుతుంటే తమకే రాలేదని డీలర్లు బదులిస్తున్నారు. ప్రస్తుత నెలలో జిల్లాలో రేషన్ దుకాణాలకు 8,400 టన్నుల బియ్యం, 284 టన్నుల పంచదార సరఫరా చేశారు.

కందిపప్పును సబ్సిడీపైనైనా ఇవ్వాలి

చౌక దుకాణాల ద్వారా రేషన్ కోసం వెళితే బియ్యం, చక్కెర మాత్రమే పంపిణీ చేస్తున్నారు. కేజీ కందిపప్పును రూ.65కు పంపిణీ చేయాలి. కూటమి ప్రభుత్వం పేదలపై దయ చూపించడం లేదు. చౌక దుకాణంలో కందిపప్పు లభించక బయట కేజీ రూ.165 పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోంది. చౌక దుకాణాల్లో కందిపప్పును సబ్సిడీపై పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలి.

-కె.రాజేశ్వరి, ఆర్యాపురం, రాజమహేంద్రవరం

ఇంటర్మీడియట్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ బృందం

డిగ్రీ, ఇంటర్ కళాశాలలను వేరు చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కందుకూరి రాజ్యలక్ష్మి కాంపోజిట్ కళాశాలగా నడుస్తున్నటువంటి డిగ్రీ, ఇంటర్ కళాశాలలు వేరు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కోరారు. గురువారం ఎస్‌ఎఫ్‌ఐ తూర్పుగోదావరి జిల్లా కమిటీ ప్రతినిధులు ఇంటర్మీడియట్ కమిషనర్ కృతికా శుక్లా, ఉన్నత విద్యా మండలి డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తాను విజయవాడలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ పోరాట ఫలితంగా కందుకూరి విద్యాసంస్థల జిఒ నెం. 42 ప్రకారం ప్రభుత్వ పరం అయ్యాయని అన్నారు. అయితే కందుకూరి రాజ్యలక్ష్మి కళాశాల కంపోజిట్ కళాశాలగా నడుస్తుందని కావున దీన్ని వేరు చేయాలని అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్. రాజా మాట్లాడుతూ రాజ్యలక్ష్మి కళాశాలలో ప్రభుత్వపరం అయిన ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు రాకపోవటం, మధ్యాహ్న భోజన పథకం అమలు కావట్లేదని అన్నారు. సబ్జెక్ట్‌కి ఉపాధ్యాయులు లేరని అన్నారు. కావున 390 మంది విద్యార్థులు ఉన్న రాజ్యలక్ష్మి కంపోజిట్ కళాశాలను వేరు చేసి ఇంటర్ కళాశాలకు ప్రిన్సిపల్, ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. పాఠ్య పుస్తకాలను ఇవ్వాలని, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరినట్లు తెలిపారు. ఉన్నత విద్యామండలి కమిషనర్ స్పందిస్తూ వెంటనే కళాశాలను వేరు చేసే పని చేస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కె.జ్యోతిర్మయి, నాగజ్యోత్స్న, కార్తిక్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

21న 'చలో విజయవాడ'

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ప్రజాశక్తి - నిడదవోలు

విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21న చలో విజయవాడ విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కెఎల్ఎన్.రాజు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక డివిజన్ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఐటిసి ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల 21న విజయవాడ రామవరప్పాడు జంక్షన్ నుంచి విద్యుత్ సౌధ వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ర్యాలీలో సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంటాక్ట్ కార్మికుల రెగ్యులర్ చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, అన్‌లిమిటెడ్ మెడికల్ పాలసీ ఇవ్వాలని, గ్రాట్యుటీ సదుపాయం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని, కారుణ్య నియామకాలు ఇవ్వాలని, ఇపిఎఫ్ టు జిపిఎఫ్ కల్పించాలని తదితర సమస్యల మీద నిర్వహిస్తున్న ర్యాలీని ప్రతి ఒక్క కార్మికుడు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బివివి.సత్యనారాయణ, ఎన్.త్రిమూర్తులు, కె.భరత్, కిరణ్‌కుమార్, వినోద్, కరుణ జ్యోతి పాల్గొన్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మనిషికి టీకా ఎంత అవసరమో పంటకు విత్తన శుద్ధి అంతే అవసరమని మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు అన్నారు. గురువారం మోర్త గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు మంచి విత్తనాలను ఎంపిక చేసుకొని, వాటిని తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలన్నారు. విత్తనాల ద్వారా సంక్రమించే పలు రకాల పురుగులు, తెగుళ్ల బారి నుంచి పంటను రక్షించవచ్చునని తెలిపారు. మండలంలో 90 శాతం వరి నాట్లు పూర్తయ్యాయని, ఈ సందర్భంగా కలుపు యాజమాన్యంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మిగిలిన నాట్లు త్వరలోనే పూర్తివుతాయని అన్నారు. వరి పంటకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ఆగష్టు 15 లోగా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. ప్రీమియం చెల్లించడం ద్వారా ఏదైనా కారణాలతో పంటను నష్టపోతే తగిన బీమా లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు దీప్తి, నాగమణి, రైతులు పాల్గొన్నారు.

గ్రామ సమిష్టి పథక ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

మహిళల భాగస్వామ్యంతో గ్రామ సమిష్టి పథక ప్రణాళికపై శిక్షణా కార్యక్రమం జరిగింది. గురువారం స్థానిక స్త్రీ శక్తి భవన్ కార్యాలయంలో జరిగిన ఈ శిక్షణలో గ్రామ వాస్తవ పరిస్థితుల ఆధారంగా అవసరాల గుర్తింపు, డేటా సేకరణ, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై శిక్షణ ఇచ్చారు. డిజిటల్ మోడల్ యాప్ ద్వారా డేటా నమోదు, ఇంటర్వ్యూలు, సమగ్ర సమాచార సేకరణ వంటి అంశాలపై ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ ఎన్‌వివిఎస్.మూర్తి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళల అభివృద్ధి, ఆర్థిక స్థిరత్వం, సమగ్ర గ్రామ అభివృద్ధికి దోహదపడేలా అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పీడీ ఎం.సంతోష్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు, రాష్ట్ర, బ్యాంక్ డిజిఎం, ఎజిఎంలు, 18 మండలాలకు చెందిన వాలంటీర్లు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పాండవుల కొండపై పర్యటిస్తున్న ఎంపి

పాండవుల మెట్టను పరిశీలించిన ఎంపి

ప్రజాశక్తి - కోరుకొండ

మండలంలోని కాపవరం గ్రామంలోని బుద్ధుని వారసత్వ ప్రదేశాన్ని ఎంపి దగ్గుబాటి పురంధరేశ్వరి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాండవుల మెట్టను పరిరక్షించి, అభివృద్ధి చేయాలని ఎంపిని ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ కోరారు. ఈ ప్రదేశం ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యతను కలిగి ఉందని ఎంపి సహకారంతో బౌద్ధ పర్యాటక సర్క్యూట్లో ప్రధాన కేంద్రంగా మారుతుందని అన్నారు. పాండవుల మెట్టలో రాతి గుహలు, నీటి తొట్టెలు, స్థూపాలు, విహారాలు ఉన్నాయని, ఇది జాతీయ ప్రాముఖ్యత కలిగిన కేంద్ర రక్షిత స్మారక చిహ్నంగా ఉందన్నారు. ఈ ప్రాంతం శిథిలావస్థలో ఉండటంతో తక్షణ పరిరక్షణ అవసరం ఉందన్నారు. ఈ ప్రాంతం పర్యాటకులను ఆకర్షించడానికి మౌలిక సదుపాయాల అభివృద్ధి జరగాల్సి ఉందన్నారు. పాండవుల మెట్టను ఆధ్యాత్మిక మరియు పర్యావరణ పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తెలగంశెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ సిటీగా రాజమహేంద్రవరం నగరం

- జాతీయ స్థాయిలో 19, రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం

-ఢిల్లీలో అవార్డును అందుకున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం నగరం పరిశుభ్రతలో మరోసారి సత్తా చాటింది. స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-25 అవార్డులలో 3-10 లక్షల్లోపు జనాభా కేటగిరీలో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ దేశంలో 19వ స్థానంలో నిలవగా.. రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. ఈ మేరకు న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో గురువారం జరిగిన అవార్డుల ప్రధానోత్సవ వేడుకలో కేంద్ర హౌసింగ్ మరియు అర్బన్ అఫైర్స్ మంత్రి మనోహర్ లాల్ కట్టర్ చేతులమీదుగా కలెక్టర్ పి.ప్రశాంతి అవార్డును అందుకున్నారు. రాజమహేంద్రవరం నగర అభివృద్ధిలో ఈ పురస్కారం ఓ కీలక మైలురాయి అని కలెక్టర్, ఆర్ఎంసి కమిషనర్ పి.ప్రశాంతి అన్నారు. పరిశుభ్రత కోసం తీసుకున్న వినూత్న చర్యలు, స్మార్ట్ టెక్నాలజీ వినియోగం, డోర్ టూ డోర్ చెత్త సేకరణ, రీసైక్లింగ్ విధానం, పారిశుధ్య సిబ్బంది కృషితో పాటు పౌరుల భాగస్వామ్యంతో ఇదంతా సాధ్య పడిందన్నారు. రాజమహేంద్రవరం నగరంలో 1,12,780 గృహాలు ఉండగా.. రోజుకి 160 టన్నుల చెత్త బయటకు వస్తుందని కలెక్టర్ తెలిపారు. ఇందులో తడి చెత్తను సేంద్రీయ ఎరువుల తయారీకి ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. నగరంలో దాదాపు 1,400 మందికిపైగా పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండగా, 182 వాహనాల ద్వారా ఇంటింటా చెత్త సేకరణ జరుగుతున్నట్లు వివరించారు. రానున్న రోజుల్లో అందరి సహకారంతో మెరుగైన ర్యాంకును సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో 54వ ర్యాంకు సాధించిన నగరం మరింత మెరుగైన స్థాయిలో నిలవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంయుడిసి ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, సిడిఎంఎ కమిషనర్ సంపత్‌కుమార్, అడిషినల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్, ఎంహెచ్ఒ వినూత్న, సిఐసి ఇన్‌ఛార్జ్ రవితేజ పాల్గొన్నారు.

అవార్డును అందుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

జంతువుల సంరక్షణకు సొసైటీల ఏర్పాటు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జంతువుల సంరక్షణ కోసం సొసైటీలను ఏర్పాటు చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. గురువారం ఎస్‌పిసిఎ నియమాలపై తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల అధికారులతో జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జంతువుల సంరక్షణ కోసం తప్పనిసరిగా సొసైటీలను, షెల్టర్‌లను ఏర్పాటు చేయాలన్న హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలన్నారు. కొన్ని జిల్లాలలో సొసైటీలు, షెల్టర్‌లు లేవన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం వీటి ఏర్పాటుపై దృష్టి సారించాలని చెప్పారు. పట్టణాలలో జంతువులను రోడ్లపై విడిచిపెట్టరాదని యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌ఎస్‌ఎ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, ఎసిబి కోర్టు జడ్జి ఎల్.వెంకటేశ్వరరావు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బిసి వసతిగృహానికి పరుపుల అందజేత

ప్రజాశక్తి - నిడదవోలు

రోటరీ ఇంటర్నేషనల్, ది కిరాణా అండ్ జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం బాలురు, బాలికల వసతి గృహాలకు 120 పరుపులను అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి పాల్గొని విద్యార్థులకు పరుపులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు ప్రెసిడెంట్ మీసాల శివరామహరిప్రసాద్, సెక్రటరీ దారపురెడ్డి శ్రీరామప్రతాప్, పాస్ట్ ప్రెసిడెంట్లు కొర్లేపర రత్నకుమార్, కొత్తపల్లి నాగేశ్వరరావు, మద్దుల సత్యనారాయణ, గోపిరెడ్డి శ్రీనివాస్, కారింకి సాయిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుపరి పాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని నందిగంపాడు గ్రామంలో గురువారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. గ్రామంలో నెలకున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయి కార్మికులకు చెల్లించాల్సిన 19 నెలల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బివిఎన్.పూర్ణిమరాజు డిమాండ్ చేశారు. నగర పరిధిలోని లాలాచెరువు వద్ద గల ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కార్యాలయం వద్ద సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయి కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 రోజుల నుంచి సత్యసాయి కార్మికులు సమ్మె చేస్తున్న కాంట్రాక్టర్ గాని, అధికారులు గానీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జడ్‌పి నుంచి రూ.28 కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వానికి నివేదించినా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. ఒక ప్రక్క సుపరిపాలన అంటూనే ప్రజలకు మంచినీరు అందించే కార్మికులు 52 మందికి 19 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం సుపరిపాలన ఎలా అవుతుందని ప్రశ్నించారు. కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ జమ చేయని కాంట్రాక్టర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. తక్షణమే జీతాలు చెల్లించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్మికుల సమ్మెకు సీతానగరం మండలం చీపురుపల్లి మాజీ సర్పంచ్ ములగ చినబాబు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి డ్రింకింగ్ వాటర్ పథకం యూనియన్ అధ్యక్షులు పి.శ్రీను, ప్రధాన కార్యదర్శి ఇసాక్, కోశాధికారి కె.రామకృష్ణ, కార్మికులు జివి.రామకృష్ణ, పి.సుబ్బారావు, పి.శేషారావు, కేవి.రాంబాబు, పి.మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న పూర్ణిమరాజు

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లి సెక్షన్ పరిధిలో 33/11 కెవి రామన్న పాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి రామన్నపాలెం రూరల్ ఫీడర్‌పై ఆర్‌డిడిఎస్ పనుల నిమిత్తం వర్క్ నిమిత్తం శుక్ర, శనివారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎన్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ధుమంతనగూడం, కొత్తగూడెం, సుబ్బరాయపురం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. **గోకవరంలో..**11 కెవి మల్లవరం లోకల్ ఫీడరును ఆర్‌డిఎస్ఎస్ పథకంలో క్రొత్త లైను నిర్మాణం నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ జెపిబి.నటరాజన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కొత్తపల్లి, రాజుపాలెం, కామరాజుపేట, సూదికొండ, గంగంపాలెం, ఠాకూరుపాలెం, జగన్నాధపురం, మల్లవరం, భూపతిపాలెం, ఉమ్మెత్త గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

కార్టూ'నిజం'



నరసన్న కొండ రోప్‌వేకు త్వరలో టెండర్లు

ప్రజాశక్తి - కోరుకొండ

కోరుకొండ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం కొండ కింద నుంచి ఆలయ శిఖరాగ్రం వరకు 0.25 కిలోమీటర్ల రోప్ వే ఏర్పాటుకు త్వరలోనే టెండర్స్ పిలవనున్నట్లు ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవస్థానంలో సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం అభివృద్ధికి రూ.36 కోట్లతో పనులకు టెండర్స్‌ను పిలవబోతున్నట్లు తెలిపారు. నరసింహ స్వామి దేవస్థానం ప్రస్తుతం అన్నవరం దేవస్థానం నుంచి టిటిడికి దత్తత ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. 0.25 కిలోమీటర్ల మేర ఆలయం కింద భాగం నుంచి ఆలయం శిఖరాగ్రం వరకు రోప్, దేవస్థానం అభివృద్ధి పనులు పూర్తి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బత్తుల

రోగులకు వైద్య సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

వేలివెన్నులో సంచార వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వేలివెన్నులో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వై.సృజన అధ్యక్షతన గురువారం సంచార వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురుకి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి తీసుకోవలసిన పోషక ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, ఐరన్ మాత్రల గురించి అవగాహన కల్పించారు. మండల పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కెకె.సుభాషిణి, ఎంఎల్‌హెచ్ పి.ప్రత్యూష, ఎఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, 104 డిఇఒ అరుణ, పాల్గొన్నారు.

నేడు చిన్న పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన

ప్రజాశక్తి - తాళ్లపూడి

చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు కోసం శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎపిఎం మంగాయమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల సమాఖ్య కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. బ్యాంకు మేనేజర్లు, జిల్లా పరిశ్రమ కేంద్రం ప్రతినిధులు, క్వాయిర్ బోర్డు, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సభ్యులు హాజరయ్యే ఈ కార్యక్రమానికి మహిళలంతా ఆధార్, పాన్‌కార్డు, పాస్ పోర్ట్ సైజు ఫోటోలతో హాజరుకావాలని కోరారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్లేట్లు, ఆట వస్తువుల పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

సాధన మహిళా మండలి ఆధ్వర్యంలో మండలంలోని పురుషోత్తపట్నం ఎస్‌సి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు ప్లేట్లు, ఆట వస్తువులు పంపిణీ చేశారు. కీర్తిశేషులు తాతపూడి సుందర్‌రావు జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాధన మహిళా మండలి ఛైర్మన్ పి.సుజ్ఞానకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కడియం రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి - కడియం

శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 24వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు కడియం నుంచి రాజవోలు వెళ్లే కడియం రైల్వే గేటును అత్యవసర ట్రాక్ మరమ్మతు పనుల నిమిత్తం మూసివేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే రాజమహేంద్రవరం శాఖ సీనియర్ సెక్షన్ ఇంజనీర్ గురువారం ప్రకటనలో తెలిపారు. వాహనదారులు ఈ వారం రోజులపాటు వారి యొక్క వాహనాలను వేరే మార్గం నుంచి ప్రయాణం కొనసాగించేలా ప్రయత్నాలు చేసుకోవాలని సూచించారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - సీతానగరం

ఒక చోరీ కేసులో పాత నిందుతులు ఇద్దరిని అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి వై.శ్రీకాంత్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. మండలంలోని రఘుదేవపురం గ్రామంలో ఈ నెల 6వ తేదీ నుంచి 12వ తేదీ మధ్య జరిగిన చోరీపై కేసు నమోదు చేసి విచారించినట్లు తెలిపారు. సాంకేతిక పద్ధతులను ఉపయోగించి పోలీసులు ముగ్గళ్ళ గ్రామంలో ఈ కేసులో నిందుతులను అరెస్టు చేసి వారి నుంచి ఉంగ రం, 750 గ్రాముల విలువైన వెండి వస్తువులు, రూ.1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దొంగతనానికి ఉపయోగించిన మోటార్ సైకిల్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. రఘుదేవపురం గ్రామానికి చెందిన నీలంశెట్టి వెంకటేశ్వరావు, రాజానగరంకు చెంద గొబ్బ భానుశివశంకర్‌లుగా గుర్తించామని, వీరు జల్సాలకు అలవాటు పడి, సులువుగా డబ్బు సంపాదించేందుకు మోటార్ సైకిళ్లను దొంగిలించి, ఆపై వాటిని విక్రయించి జల్సాలు చేస్తున్నారని తెలిపారు. వీరిపై వివిధ పోలీస్ స్టేషన్లలో 14 కేసులు నమోదయ్యాయని ఆయన వివరించారు. నిందుతులను అరెస్టు చేయడంలో కృషి చేసిన హెచ్‌సి వాసంశెట్టి శ్రీను, కానిస్టేబుళ్లు కుమార్, రమేష్‌లను ఆయన అభినందించారు.

ట్రాక్టర్ దహనం ఘటనపై కేసు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

గుర్తు తెలియని అపరిచిత వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి ట్రాక్టర్ ను దహనం చేశారు. దీనిపై బాధితుడు గురువారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇవి.. కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామానికి చెందిన రైతు తుపాకులభీ సత్యనారాయణకు ముమ్మిడివరం మండల పరిధిలో అయినాపురం పంచాయతీ శివారులోని వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. అతను ఉదయం పొలం వెళ్లి చూసేటప్పటికి కాలిపోయి ట్రాక్టర్ ఉంది. దీనిపై అనుమానం వ్యక్తం చేస్తూ రైతు సత్యనారాయణ ఫిర్యాదుతో అమలాపురం డిఎస్‌పి ఆదేశాల మేరకు సిఐ మోహన్ కుమార్, ఎస్ ఐ జ్వాలా సాగర్ డాగ్ స్క్వాడ్ ను రప్పించారు. ట్రాక్టర్ దహనం చేసిన ప్రదేశాన్ని డాగ్ స్క్వాడ్ సిబ్బంది పరిశీలించి, తనిఖీ చేయగా డాగ్ స్క్వాడ్ ఆయా ప్రదేశాలలో తిరిగి కోళ్ల ఫారం దగ్గరకి వెళ్లి ఆగిపోయిందని పోలీసులు తెలిపారు. నిందితులను గుర్తించి తగ్గినతగిన పట్టుకొని కేసు చేధిస్తామని పోలీసులు తెలిపారు. సంఘటన ప్రదేశానికి సర్పంచ్ తదితరులు పరిశీలించారు.

ట్రాక్టర్ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని ఖండవల్లి పరిధిలో జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అచంట మండలం వల్లూరు గ్రామానికి చెందిన నార్నిమిల్లి వెంకటేశ్వరరావు (42) గురువారం తెల్లవారుజాము పంగిడి నుంచి మెటల్ తీసుకెళ్తుండగా వచ్చాడు. ఖండవల్లి సెంటర్‌లో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు పోలీసులు ఏర్పాటు చేసిన ఐరన్ డ్రమ్ములను గమనించకుండా వేగంగా ట్రాక్టర్ నడిపే క్రమంలో సడన్ బ్రేకులు వేశాడు. ట్రాక్టర్ డ్రమ్ములు ఢీకొట్టడంతో ట్రాక్టర్ యూటర్న్ తిరిగిపోయింది. దీంతో డ్రైవర్ ట్రాక్టర్ పై నుంచి కింద పడిపోయాడు. ట్రాక్టర్ ట్రక్కు టైరు అతనిపై ఎక్కేసింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు.

పేకాడుతున్న నలుగురు అరెస్టు

ప్రజాశక్తి-పెద్దాపురం

దివిలి గ్రామ శివారులో పేకాట శిబిరంపై గురువారం ఎస్ఐ మౌనిక ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన దాడుల్లో నలుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ.10,050 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ మౌనిక మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించామన్నారు. ఎక్కడైనా జూదాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిపితే వారికి తగిన పారితోషకం ఇస్తామని ఆమె ప్రకటించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -రౌతులపూడి

రౌతులపూడి ప్రభుత్వసుపత్రిలో మనస్తాపంతో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. రౌతులపూడికి చెందిన లోవరాజు భార్య అప్పలనారాయణ (79) 20 ఏళ్లుగా ఆయాసం, కడుపునొప్పి, గుండె సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్నాడు. రెండు రోజులుగా స్థానిక ప్రభుత్వసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం రాత్రి ఒంగి, రుమాలుతో ఆస్పత్రి ఆవరణలో ఉన్న మామిడి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆసుపత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

మోటార్ సైకిల్ చోరీపై కేసు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఇంటి ఆవరణలో పెట్టిన మోటార్ సైకిల్ ఒక వ్యక్తి దొంగిలించుకు పోయిన సంఘటన సిసి కెమెరాలు రికార్డు అయింది. దీనిపై బాధితుడు పాయసం సత్య ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు గురువారం తెలిపారు. వివరాలు ఇవి.. నగర పంచాయతీ పరిధిలోని క్రాప చింతలపూడి గ్రామానికి చెందిన బాధితుడు బుధవారం రాత్రి తన ఇంటి ఆవరణలో మోటార్ సైకిల్ ను పార్కు చేశాడు. అయితే ఆమోటార్ సైకిల్‌ను అర్ధరాత్రి సమయంలో ఒక వ్యక్తి దొంగిలించిన దృశ్యం సిసి కెమెరాలో రికార్డు అయింది.దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సారా బట్టీలపై దాడులు

ప్రజాశక్తి - గోకవరం

ఇటికాయలపల్లి శివారులో నిర్వహిస్తున్న సారా బట్టీపై ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 30 లీటర్ల సారాని స్వాధీనం చేసుకున్నారు. 400 లీటర్ల బెల్లపు ఊటని ధ్వంసం చేశారు. రంపఎర్రంపాలెం గ్రామ శివారులో సారా బట్టీపై దాడి చేసి 10 లీటర్ల సారాని స్వాధీనం చేసుకున్నారు. 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్షీణించిన పారిశుధ్యం

- అస్తవ్యస్తంగా డ్రైనేజీలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కడియం

మండలంలోని మాధవ రాయుడుపాలెంలో పారిశుధ్యం పూర్తిగా క్షీణించింది. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఉన్న అన్ని రహదారులు చెత్త కుప్పలతో దర్శనమిస్తున్నాయి. చెత్త నుంచి సంపద కేంద్రం నేటికీ అలంకారప్రాయంగా, నిరుపయోగంగా దర్శనమిస్తుంది. గ్రామంలో మురుగు కాలువలు ఆక్రమణకు గురికావడంతో మురుగునీరు పోయే మార్గం లేకుండాపోతుంది.

పూడికతో నిండిపోయిన డ్రైనేజీ

దీంతో మురుగునీరు నివాసాల చెంతనే ఉన్న చెరువులోకి ప్రవహించడంతో చెరువు దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో దశాబ్దాల కాలం క్రితం నిర్మించిన డ్రెయినేజీలు కుంగిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. గ్రామంలోని ప్రధాన డ్రెయిన్లు నేటికీ కచ్చా డ్రెయిన్లుగా మారడంతో వ్యర్థాలు పేరుకు పోయి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. అనేక వీధుల్లో డ్రెయిన్లు లేకుండానే సిమెంట్ రోడ్లు నిర్మించడంతో మురుగునీరు పోయే మార్గం లేక గుంతల్లో మురుగునీరు నిలచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోడ్లపైనా, డ్రెయినేజీల్లో మురుగునీరు నిలిచిపోయి దోమలు, ఈగలకు ఆవాస కేంద్రాలుగా మారిపోయాయి. దోమలు పెరిగిపోతున్నా పంచాయతీ అధికారులు కనీస నివారణ చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వచ్చిన సందర్భాల్లో ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లడం తప్ప మరేయితర పారిశుధ్య పనులు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామంలో

ప్రధాన రహదారిచెంతనే చెత్త

పలుచోట్ల పారిశుధ్యం అధ్వాన్నంగా ఉండడంతో పందులు యాథేచ్ఛగా సంచరిస్తున్నాయి. దీనితో పగలు ఈగలు మోత, రాత్రులు దోమలు వాతలు, మధ్యలో పందుల గోలతో కంటిమీద కునుకు లేకుండా రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు సమస్యలతో సతమతమవుతున్న గ్రామ ప్రజలకు పుండు మీద కారం చల్లినట్లు జలజీవన్ మిషన్ పనుల్లో భాగంగా రోడ్ల వెంబడి తవ్విన రద్దు మరో సమస్యగా మారింది. ఇప్పటికైనా గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం

ప్రజాశక్తి - కొవ్వూరు

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ శాఖ పూర్తిగా విఫలం అవుతుందని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సుందర్‌బాబు, బి.పవన్, జెఎసి అధ్యక్షులు రాజాన అప్పారావు విమర్శించారు. గురువారం స్థానిక పురపాలక సంఘం కార్యాలయం వద్ద జరుగుతున్న సమ్మె శిబిరాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినప్పటికీ మున్సిపల్ కార్మికులకు ఒరిగింది ఏమీ లేదన్నారు. గతంలో చేపట్టిన రాష్ట్ర వ్యాప్త సమ్మె సందర్భంగా ప్రభుత్వం

ధర్నా చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

అంగీకరించిన ఒప్పందాలకు జిఒలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. కార్మికులకు వెన్ను దన్నుగా ఉన్న ఆప్కాస్ సంస్థను సైతం రద్దు చేసి ప్రయివేట్ ఏజెన్సీలను ప్రోత్సహించాలనుకోవడం సరి కాదన్నారు. స్థానిక మున్సిపాలిటీలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగ - ఉపాధి అవకాశాలు ఇవ్వక పోవడం చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సైతం అమలు చేయలేదని, పారిశుధ్య కార్మికులకు ఇవ్వాల్సిన పరికరాలు సైతం అందించకపోవడం దారుణమన్నారు. తక్షణమే మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు భూపతి రవీంద్ర, పూజారి వాసు, కల్యాణ్‌రాజేష్, అల్లం విజయకుమార్, మీసాల శివశంకరజ్యోతి, అల్లం వెంకటలక్ష్మి, మీసాల వరలక్ష్మి, సంగంరెడ్డి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేసిన త్రిసభ్య కమిటీ

ప్రజాశక్తి - గోకవరం

గోకవరం సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా గాజింగం సత్యనారాయణ, సభ్యులుగా కొత్తల వీరఅప్పారావు, వాకాడ కాటమస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం స్థానిక సూర్య ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సత్యనారాయణను, ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూను అభిమానులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ నాపై నమ్మకంతో సొసైటీ ఛైర్మన్‌గా నియమించిన ఎంఎల్‌ఎ



ప్రమాణం చేస్తున్న ఛైర్మన్ సత్యనారాయణ

జ్యోతుల నెహ్రూ నమ్మకాన్ని వమ్మి చేయకుండా సొసైటీని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు. ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గోకవరం సొసైటీకి మంచి వ్యక్తులను నియమించడం జరిగిందని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రకాలుగా నాశనం చేసిన జగన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా ప్రజలు తగిన బుద్ధి చెప్పారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా అందిస్తూ సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని తెలిపారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఈ నెలలోనే రైతులకు అన్నదాత సుఖీభవ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కుటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గోకవరం

స్థానిక సంజీవయ్యనగర్ కాలనీలో టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శి గున్నూరు లాజర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ ఆవిష్కరించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ మాట్లాడుతూ తెలుగువారి ఆరాధ్య దైవం ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందకరమని అన్నారు. ఎన్‌టిఆర్ చేసిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. అనంతరం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, అడపా భరత్, గాజింగం

ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ

సత్తిబాబు, ఉంగరాల రాము, పాలూరి బోసుబాబు, దాసరి సీతారామకృష్ణ, మంగరౌతు రామకృష్ణ, పిల్లా చంటిబాబు, చింతల రవికాంత్, ఎస్.బాబు, గల్లా రాము పాల్గొన్నారు.

21న ఆర్‌టిహెచ్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఈ నెల 21న రాజమహేంద్రవరం రూరల్‌లో నిర్మించిన ఆర్‌టిహెచ్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నిరాముడు తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఆర్‌టిహెచ్ కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమ ఏర్పాట్లుపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూలై 21న ప్రత్యక్షంగా హాజరై గానీ, లేదా వర్చువల్ ద్వారా కానీ ఆర్‌టిహెచ్ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. ఇప్పటికే భవనాన్ని, ఇతర మౌలిక వసతులు కల్పించడం జరిగిందని తెలిపారు. ఆర్‌టిహెచ్‌ను ప్రారంభించిన అనంతరం ప్రభుత్వ విద్యా సంస్థలు, పారిశ్రామిక వేత్తలతో సంభాషించి, వారి ఆలోచనలను ముఖాముఖి తెలుసుకోవడం జరుగుతుందని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖుల పర్యటన దృష్ట్యా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో క్షేత్ర స్థాయిలో భద్రతా ఏర్పాట్లు, స్టేజి నిర్మాణం, సీటింగ్ ఏర్పాట్లుపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డిఎస్‌పి భవ్యకిషోర్, జిల్లా అగ్నిమాపక అధికారి మార్టిన్ లూథర్ కింగ్, ఆర్‌ఎంసి ఎస్ఇ ఎంసిహెచ్.కోటేశ్వరరావు, ఇఇ మదర్స్ ఆలీ షేక్, కలెక్టరేట్ డిటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వాసన భరించలేమంటున్న గ్రామస్తులు

కొంగల బెడతో ఇక్కట్లు..!

ప్రజాశక్తి - దేవరపల్లి

మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో కొంగల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోకి కొంగలు గుంపులుగా ప్రవేశించి ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నివాసాల మధ్య ఉన్న చెట్లపై నిత్యం సంచరిస్తున్నాయి. దీంతో దుర్వాసన రావడంతో పాటు చిన్నారులు, వృద్ధుల శరీరంపై దద్దుర్లు, దురదలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై పంచాయతీ సిబ్బందికి చెప్పిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పథకాల అమలుకు బాబు కుంటి సాకులు

రావులపాలెం: ప్రభుత్వ పథకాల అమలుకు నిధుల లోటు అంటూ సిఎం చంద్రబాబు కుంటి సాకులు చెబుతున్నారని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ విమర్శించారు. గురువారం కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్ లో బిసి నాయకుడు మట్టా వీరబాబు గౌడ్ అధ్యక్షతన జరిగిన బీసీ ఆత్మీయ సమావేశానికి రామచంద్ర యాదవ్ హాజరయ్యారు.

మామిడికుదురు: దోపిడీ పార్టీలు, దోపిడీ ప్రభుత్వాలు అంతం కావాలని, ప్రజా రాజకీయం దిశగా ముందుకు వెళుతున్నామని బోడే రామచంద్ర యాదవ్ అన్నారు అప్పనపల్లిలో జరిగిన బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడారు.

IN THE COURT OF THE HON'BLE
VI ADDL. DISTRICT JUDGE :: KAKINADA
G.O.P. No. 51 / 2025
(In the matter of Sale of Minor's Property by Guardian)
Between:
Chellam Srilatha, W/o Late Ravi Kumar, Housewife, aged 35 years, Quarter No.HC/42, 3rd APSP, Ramanayyapeta, Kakinada, Kakinada District. ...Petitioner
and
Nil ...Resondent
పై నెంబరు పిటిషన్‌లో పిటిషనర్ గారి కుమారులు అయిన **Chellam Viswanath Raj** మరియు **Chellam Santha Hruday** మైనర్లు అయినందున పిటిషనర్ **Chellam Srilatha** గారు గార్డియన్ అయి ఉండి, సదరు మైనర్లు యొక్క చదువు మరియు ఇతర ఖర్చుల నిమిత్తం ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిలో అనిర్దిష్టమైన వాటాను అమ్ముట కొరకు పై కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. కావున ఈ క్రింది తెల్పిన ఆస్థి విక్రయం గురించి ఎవరికైనా, ఏ విధమైన ఆక్షేపణలు లేదా అభ్యంతరములు ఉన్న యెడల ది.**04-08-2025** తేదీకి పైన తెల్పిన కోర్టులో ఉదయం **10.30** ని॥లకు హాజరయి ఆక్షేపణలు తెలియజేయవలెను.
SCHEDULE: East Godavari District, Kakinada Rural Mandal, Kakinada Registry, Vakalapudi Gram Panchayat, Vakalapudi Village, S.No.47/1A, 47/1B and 47/3 an extent of Ac.42-00 cents in L.P.No.44/84, resolution No.52/44, Plot No.6 an extent of 382 Sq. yards in which an extent of 129.66 Sq. Yards or 158.41 Sq. Meters of vacant site in two items bounded by:
Item No.1: 112.66 Sq. yards of vacant site:
East: 26.0 feet or 7.92 Mts - Item No.2 Joint passage way, **West:** 26.0 feet or 7.92 Mts - Site in Plot No.5, **South:** 39.0 feet or 11.88 Mts - 33 feet width Road, **North:** 39.0 feet or 11.88 Mts - Site belongs to Sade Rama Krishna in this number. Within the above boundaries an extent of 112.66 Sq. yards of vacant site with all easementary rights.
Item No.2: 51 Sq. yards of Joint Passage way:
East: 76½ feet or 23.30 Mts - Site in Plot No.7, **West:** 76½ feet or 23.30 Mts - Item No.1 to some extent, Site belongs to Sade Rama Krishna to some extent, Site belongs to Akula Venkata Atchuta Rama Krishna, **South:** 6.0 feet or 1.82 Mts - 33 feet width Road, **North:** 6.0 feet or 1.82 Mts - Open to Sky.
Within the above boundaries an extent of 51 Sq. Yards Joint unspecified 1/3rd share an extent of 17 Sq. Yards or 14.21 Sq. Meters with all easementary rights, etc.
Within the above two items an extent of 129.66 Sq. Yards or 158.41 Sq. Meters of vacant site with all easementary rights etc.
K.V.S.V.LAKSHMAJI RAO (VENU)
Advocate, D.No.6-1-9/1, Dusarlapudivari Street,
KAKINADA, Cell: **9866211196**

కారంచేడు అమరులకు ఘన నివాళి

ప్రజాశక్తి - నిడదవోలు

కారంచేడు అమరవీరులకు కెవిపిఎస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. గురువారం స్థానిక చర్చ్ పేటలో జరిగిన ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు జువ్వల రాంబాబు పాల్గొని కారంచేడులో దళితులపై జరిగిన మారణహోమ సంఘటనను వివరించారు. నేటికీ రాష్ట్రంలో ఎస్‌సిలపై అనేక దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు పాలక ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో చర్చ్ పేట యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కెవిపిఎస్ ఆధ్వర్యంలో నినాదాలు చేస్తున్న యువత

మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ గోరంట్ల, రాంజీ

సర్పంచ్ రాంజీ భోళా శంకరుడు

ప్రజాశక్తి - కడియం

నిత్యం ప్రజల మధ్య తిరుగుతూ ఆపదలో, కష్టంలో ఉన్నవారికి చేదోడు, వాదోడుగా నిలుస్తున్న సర్పంచ్ రాంజీ భోళా శంకరుడు అని ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మండలంలోని కడియపులంక సర్పంచ్ పాటంశెట్టి రాంజీ పుట్టినరోజు వేడుకలను గ్రామ ప్రజల మధ్య గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ గోరంట్ల చేతుల మీదుగా సుమారు 800 మంది మహిళలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం జాతీయ రహదారి ప్రక్కన ఏర్పాటు చేసిన సర్పంచ్ రాంజీ కార్యాలయాన్ని గోరంట్ల ప్రారంభించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు రాంజీకి అభినందనలు తెలిపారు.

సదస్సులో మాట్లాడుతున్న సూర్యమోహన్‌రావు

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని కొత్తపల్లి ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో గురువారం మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ త్రినాథరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో జిల్లా ఈగల్ సెల్ సిఐ పువ్వల సూర్యమోహన్‌రావు పాల్గొన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాన్ని, వినియోగించే వ్యక్తుల మానసిక, శారీరక పరిస్థితిపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారి నేర ప్రవృత్తిని కలిగి ఉంటున్నారని వారి వల్ల వారి కుటుంబానికే కాక సమాజానికి కూడా నష్టం కలుగుతుందని తెలిపారు. నేటి యువతలో సమయపాలను సరిగ్గా ఉపయోగించుకోలేక ఒత్తిడికి గురై వారి యొక్క విలువైన ప్రాణాలను ఫణంగా పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెసిఐ కాకినాడ డైమండ్ ప్రెసిడెంట్ కామేష్ బృందం, ఆదర్శ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కాకినాడ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 3/2024
I.A. No. 4/2024
O.S. No. 78/2023
Between:
Reddy Ratnam and Another
-పిటీషనర్లు/వాదులు
AND
Anasuri Srinivasa Rao and Others
-రెస్పాండెంట్లు/ ప్రతివాదులు
To:
Gunnam Ranga Rao, S/o. Viswanatham, D.No. 70-2-143/2A, Flat No. 304, Iswaryambica Apartments, Opp: Ashram Public School Road, Ramanayyapeta, Kakinada.
-3వ రెస్పాండెంటు/ 3వ ప్రతివాది
పై నెంబరు దావాలోను, 3వ ప్రతివాది మరియు I.A. No. 3/2024, I.A. No. 4/2024 పిటీషన్లులోను 3వ రెస్పాండెంటు అయిన మీకు దావా సమన్లు/నోటీసులు పంపిననూ తీసుకొకన కాలయాపన చేయుచున్నందున మీ యొక్క హాజరు నిమిత్తం ది. **28-7-2025** నకు వాయిదా వేసియున్నారు. మీరు ఆరోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలున్న తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
భద్రిరాజు సుబ్బారావు
వాది తరపు అడ్వకేటు
కాకినాడ కాకినాడ
ది.14-7-25 సెల్: 9390209021

మహారాజశ్రీ నిడదవోలు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోరులో
I.A.No.206/2024 & O.S.No:157/2024
మరియు O.S.No:157/2024
Between : శ్రీ చెక్కా B.K.S.V. రవికుమార్ తండ్రి : సర్వేశ్వరావు, హిందువు, Age 45 సం॥లు వ్యాపారం, కృష్ణాబుక్‌స్టాల్, నిడదవోలు ...పిటీషనరు (వాది)
And
శ్రీ ఆనందం సూరిబాబు, తండ్రి : మార్కండేయులు, హిందువు, వ్యాపారం, Age 48 సం॥లు, డి.నెం. 2-24-10, శాంతినగర్, నిడదవోలు ... రెస్పాండెంటు (ప్రతివాది)
ఈ నెంబరు దావాలోని ప్రతివాది అయిన శ్రీ ఆనందం సూరిబాబు మరియు IA 206/2024 లోని రెస్పాండెంటు అయియున్నారు. సదరు దావా గ్రంథంలోని ప్రతివాది IA లోని రెస్పాండెంటు శ్రీ కోర్టు వారు పంపిన నోటీసు దావా సమన్లు తీసుకొనక తప్పించుకొనుటవలన సదరు రెస్పాండెంటు / ప్రతివాది పై కోర్టు వారి ఎదుట ది.23-7-2025 పైకోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారాగా గానీ హాజరు అయి తమ ఆక్షేపణలు తెలుపు కోవలయును. లేనిచో సదరు గ్రంథములు పరోక్షమున తీర్మానించబడును.
ఇట్లు
శ్రీ Y. శ్రీనివాస రావు
ప్రదేశం : నిడదవోలు, పిటీషనరు (వాది) తరపు అడ్వకేట్,
తేది : 23.06.2025 నిడదవోలు. సెల్ : 98499 80905

రఘుదేవపురంలో సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రఘుదేవపురంలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. రుడా ఛైర్మన్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. స్థానికంగా ఉన్న ప్రజా అవసరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాండ్రు శ్రీనివాసరావు, చుండ్రు సత్యప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

In the Court of the VII Additional Junior Civil Judge at Kakinada
O.S. No. 1146/2024
Between:
Naraharisetti Lakshmi Narayana Sai Swaroop ...*Plaintiff*
AND
Pulla Srilakshmi ...*Defendant*
To:
Pulla Srilakshmi, W/o. Ramu, House Wife, R/o. D.No. 4-87, Panchayat Back side, Sarpavaram, Kakinada, Kakinada Rural Mandal, Kakinada Dist.,
వాదికి రావలసిన బాకీ నిమిత్తం పై దావా దాఖలు చేసి వున్నారు. సదరు దావాలో మీ హాజరు నిమిత్తం **ది. 30-7-2025వ తేదీకి వాయిదా అయి వున్నది.** మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు వారి ఎదుట **ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరు అయి మీరు తెలుపుకోవలెను. లేని ఎడల పై దావా మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
చక్కా ఎన్.వి.ఎస్.శ్రీనివాస్
అడ్వకేట్, కాకినాడ
సెల్: 9848293766

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
E.P.No.4/2023 in OS.No.704/2015
Between:-
జుజ్జరపు శ్రీహరి మరియు వగయిరాలు
...డిక్రిహోల్డర్
మరియు
రాయవరపు వీర వెంకటేశ్వరరావు
...జడ్జిమెంటు డెబ్టర్
జడ్జిమెంటు డెబ్టర్:-
రాయవరపు వీర వెంకటేశ్వరరావు, తండ్రి రామసుందరరావు, వయస్సు 76సం॥లు, ప్రోపర్టి ఓనర్, వ్యాపారము, డోర్‌నెం.7-1A-16, రమణయ్యపేట, కాకినాడ.
పై నెంబరు ఎగ్జిక్యూషన్ పిటీషన్‌లో, JDR కు Or 21,Rule 66 నోటీసులు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించిననూ మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక కాలయాపన చయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తము **ది.05-08-2025** సం॥ తేదీన ఉదయం **గం.10.30ని॥లకు** మీరు స్వయంగాగాని మీ వకీలు ద్వారా గాని హజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసు కొనవలెను. లేని ఎడల పై పిటీషను మీ పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియ జేయడమైనది.
R.T.CHOWDARY
డిక్రి హోల్డర్ తరుపున అడ్వకేట్
సెల్.9440702610

SUMMONS
(Substitute Service under order V Rule 20 CPC as per orders of the Hon'ble Court)
IN THE COURT OF THE III ADDITIONAL DISTRICT JUDGE : KAKINADA
I.A.809/2025 in O.S.55/2025
Between :
Kovvuri Madhan Mohan Reddy
..Petitioner/Plaintiff
And
Karri Veera Raghava Reddy and Others
...Respondents/Defendants
To,
Karri Chandra Sekhara Reddy, S/o. Karri Vani, Aged 45 years, Private Job, R/o. Door No. 59-19-11/3, Pastorpeta, Kakinada - 533002.
(Respondent No.7/Defendant No.7)
That as per the orders of the Hon'ble Court Notice is hereby published that you shall appear before the Hon'ble Court on **19-08-2025** either in Person or through your Advocate **at 10.30 A.M,** if you fail to appear the matter will be heard and decided by the Hon'ble Court as per Law. Hence this substitute service of suit summons published as per the orders of the Hon'ble Court Dated: 14-07-2025.
BATCHU RAJESH, Advocate
#25-6-37/A, Ganjamvari Street,
KAKINADA. Cell: 9848945055

ప్రకటన
మహారాజశ్రీ పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A.No.183/2022 In O.S.No.12/2017
చిడం శ్రీ రామమూర్తి ...పిటీషనరు
మరియు
చిడం లక్ష్మి వగైరాలు ...రెస్పాండెంట్లు
13వ రెస్పాండెంటు :
కోన మురళీకృష్ణ, S/o. (లేటు) అప్పారావు, ఎలక్ట్రీషియన్, డోర్ నెం.3-1-147, మార్కండ్రాజుపేట, తుని.
కోర్టు వారి ఆర్డరుపై తెలియచేయునది ఏమనగా, పై నెంబరు దావాలో ప్రతివాదిగా చేర్పించమని పిటీషను దాఖలు చేసినందున మీ హాజరు నిమిత్తమై నోటిసులు పంపుతుండగా మీరు అందుకోకుండా ఉన్నందున, ఇందుమూలంగా తెలియచేయునదేమనగా పై నెంబరు పిటీషను వాయిదా **ది. 21-07-2025న** ఉన్నందున, సదరు తేదీన పై కోర్టువారి ఎదుట మీరు **ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా కాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని గ్రహించగలరు.
కొత్త మాణిక్యాలరావు, న్యాయవాది
అన్నపూర్ణ థియేటర్ వెనుక,
కుంతి మాధవనగర్, పిఠాపురం
పిఠాపురం.
ది.16-07-2025 సెల్: 94403 41790

దస్తావేజులు పోయినవి
తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామానికి చెందిన రాయుడు సూర్యనారాయణ కు గల ఆర్ ఎస్ నెం **327/ 1** లో 193.75 చదరపు గజాలకు చెందిన ఒరిజినల్ దస్తావేజు నెం **4147/2015** డాక్యుమెంట్ ది **01-7 -2025** తేదీన జిరాక్స్ తీసుకోను నిమిత్తం గౌరీపట్నం నుండి దేవరపల్లి వస్తుండగా దారి మార్గ మధ్యలో పడిపోయినవి.దొరికినవారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు
రాయుడు సూర్యనారాయణ
గౌరీపట్నం, దేవరపల్లి మండలం
తూర్పుగోదావరి జిల్లా
సెల్ :9959737114

పాస్‌పోర్ట్ పడిపోయినది
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లి గ్రామానికి చెందిన సానబోయిన మంగాయమ్మ భర్త: వెంకట నర్సయ్య పాస్‌పోర్ట్ పడిపోయినది. పాస్ పోర్ట్ నెం. **P2276633** ది. **4-07-2025** వ తేదీన కె. ఏనుగుపల్లి నుండి పి.గన్నవరం జిరాక్స్ తీయించుటకు వెళుతుండగా మార్గమధ్యంలో పడిపోయినది.దొరికిన వారు ఈ క్రింద అడ్రస్ కు అందజేయగలరు.
సానబోయిన మంగాయమ్మ
భర్త: వెంకట నర్సయ్య
కె.ఏనుగుపల్లి గ్రామం, పి.గన్నవరం మండలం
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్ : 9705216067

Or.5R.1&5CPC
దావా సమను మరియు నోటీసు
మహారాజశ్రీ ముమ్మిడివరం సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No.17/2022 మరియు
I.A.54/2022 in O.S.17/2022
Between:-
ముత్తాబత్తుల లక్ష్మి ...వాది/పిటీషనర్
మరియు
పాము కృష్ణ కుమారి వగైరా
...ప్రతివాదులు/రెస్పాండెంట్లు
To:-
1వ ప్రతివాది/రెస్పాండెంట్: పాము కృష్ణ కుమారి, భర్త :పాము ప్రసాద్, డోర్ నెంబర్,1-501/1, రాయుడుపాలెం, కాకినాడ.
2వ ప్రతివాది/రెస్పాండెంట్: కాశి సుదర్సనమ్మ, భర్త: లేట్ రామ మూర్తి, గానుగు వీధి, దానవాయిపేట, రాజమహేంద్రవరం.
పై నెంబరు దావాలో మరియు పిటీషన్లో మీకు కోర్టు వారు ఎన్నిసార్లు దావా సమన్లు మరియు నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పై దావా మరియు పిటీషన్ మీ హాజరు నిమిత్తము ది.23-7-2025 కు వాయిదా వేసి యున్నారు. కావున మీరు సదరు తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥10.30 ని॥లకు స్వయంగా కాని లాయరు గారి ద్వారా గాని హాజరై తమ అభ్యంతరములు తెలియచేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున దావా మరియు పిటీషన్ తీర్మానించబడునని ఇందు మూలముగా మీకు తెలియ చేయడమైనది.
(శ్రీ కోర్టు వారి అనుమతితో)
జి.వి.రామారావు
అడ్వకేట్
ముమ్మిడివరం ముమ్మిడివరం
తేది.17-07-2025 సెల్.9290286024